క్లుప్తంగా

ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాల సంబరాల్లో విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడ శ్లోక ది గ్లోబల్ స్కూల్‌లో బుధవారం ఘనంగా బోనాల సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులు పోతురాజుల విన్యాసాలతో అలంరించారు. అమ్మ బైలెల్లినాదే.. తల్లి బైలెల్లినాదే.. అంటూ నృత్యాలు చేస్తూ పోచమ్మ, మహంకాళి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. బోనాలకు తెలంగాణకు ఉన్న అపురూప ఘట్టాలను విద్యార్థులకు పాఠశాల చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి వివరించారు. విద్యార్థులపై అమ్మవార్ల ఆశీర్వాదాలు ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజనా దేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు స్కూల్ కిట్లు అందిస్తున్న కానిస్టేబుళ్లు, నిర్వాహకుడు

కందుకూరు: మండల కేంద్రంలో షారోన్ సేవా మినిస్ట్రీస్ కేంద్రంలో నిర్వాహకుడు రాబర్ట్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 45 మంది పేద విద్యార్థులకు స్థానిక కానిస్టేబుళ్ల చేతుల మీదుగా స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, టిఫిన్ బాక్స్ తదితర వస్తువులను ఓ కిట్‌గా చేసి ఉచితంగా అందించారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఆ కేంద్రంలో పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పడంతో పాటు రాత్రి భోజనం అందిస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులను రేషనలైజేషన్ చేయాలి

వనస్థలిపురం: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులను రేషనలైజేషన్ చేసి, బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన జెడ్పీహెచ్‌ఎస్ సాహెబ్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ పాఠశాలల్లో పర్యటించి మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎక్కువగా ఉండి ఉపాధ్యాయులు తక్కువగా ఉండడంతో వారికి నాణ్యమైన విద్యా అందడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతుందని, ఉమ్మడి ఏకీకృత సరీస్ రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులు, ఎంఈఓ, జేఎల్, డైట్ లెక్చరర్లకు పదోన్నతులు ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాధాకృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి దీనదయాళ్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురారి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిలో సేవాభావం ఉండాలి

హస్తినాపురం: సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. విఠల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం సాగర్‌రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ కాన్సెప్ట్ స్కూలు విద్యార్థులు కీర్తన అనాథ ఆశ్రమానికి 6 క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటళ్ల కందిపప్పు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు సమాజం పట్ల అవగాహన కల్పించి వారిని ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి తమ విద్యాసంస్థలో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజని శేషారావు, రాజశేఖర్, విజయ్ కుమార్‌రావు, సునిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం

ఇబ్రహీంపట్నం రూరల్: పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరమని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి జయశ్రీ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో జయశ్రీ టై, బెల్టులు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత జయశ్రీ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ బడులకు దాతలు సహకారం అందించాలని తెలిపారు. నిరంతరం సంపాదనే లక్ష్యంగా కాకుండా సంపాదించిన దాంట్లో కొంతైన ఖర్చు పెట్టాలని అప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ.. మాకేది?



రైతు వేదికభవనంలో రుణమాఫీ కోసం దరఖాస్తులు ఇస్తున్న రైతులు

నేటికీ ఖాతాల్లో జమకాని నగదు

- రైతు వేదికలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఇబ్బందుల్లో రైతన్నలు
- పట్టించుకోని అధికారులు

మంచాల: ప్రభుత్వం రెండు దఫాలుగా రుణమాఫీ మంజూరు చేసినా మాఫీకానీ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న తమకు ఎందుకు మాఫీ కాలేదని మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మంచాల మండలంలో మొదటి విడుతగా లక్షలోపు 3,680 రైతు కుటుంబాలకు మాఫీ కావల్సి ఉంది. కానీ 3,200 రైతు కుటుంబాలకు మాఫీ అయ్యింది. ఇంక 480 రైతు కుటుంబాలకు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. రెండో విడుత లక్ష యాభైవేలు రుణమాఫీ 1,309 రైతు కుటుంబాలకు కావల్సి ఉండగా 1,084 రైతు కుటుంబాలకు మాఫీ అయ్యింది. 225 కుటుంబాలకు ఇంకా కాలేదు. రుణ మాఫీ రాని రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ కార్డు వంటివి తీసుకొని బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ కానీ రైతులు మాత్రం తమకు ఎందుకు మాఫీ కావడం లేదని అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారని మాఫీ కానీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రేషన్ కార్డు లేక పోవడం, ఆధార్ కార్డు మిస్ మాచింగ్, ఒకే కుటుంబంలో రూ.2లక్షలకు పైగా అప్పు ఉండడం, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్టు వంటి వారికి రుణ మాఫీ కావడంలేదని కొందరు చెబుతున్నారు. గతంలో ట్రాక్టర్లు కొను గోలు చేసిన రైతులు, బతుకుదెరువు కోసం ఆటోలు నడుపుకున్న రైతుల రేషన్ కార్డులను తొలగించారు. కొంత మందికి తిరిగి రేషన్‌కార్డులు నమోదు చేశారు. మరికొందరివి నమోదు చేయలేదు.

నిత్యం వస్తున్నారు..

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనానికి మాకు రుణ మాఫీ రాలేదనిపెద్ద సంఖ్యలో రైతులు వచ్చి పోతున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది కంప్యూటర్లలో పరిశీలన చేసి కారణాలను రైతులకు వివరిస్తున్నారు. అధికారులు అడిగిన ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం ఇచ్చాం. కంప్యూటర్లలో తప్పులతో నమోదు చేయడం వల్లే తమకు రుణమాఫీ కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన రైతులను గుర్తించి తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మిస్ మ్యాచింగ్ అంటున్నారు



మాది ఆస్మత్‌పూర్ గ్రామం. ఎకర వ్యవసాయ పొలం ఉంది. ఆరుట్ల ఎస్‌బీహెచ్ బ్యాంకులో నేను రూ.38వేలు పంట రుణం తీసుకున్నాను. రెండు దఫాలు రుణమాఫీ చేసినా నా పేరు రాలేదు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లగా ఆధార్ కార్డు మిస్ మ్యాచింగ్ వల్ల ఇతరుల పేరు చూపిస్తుందని చెబుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– పుట్ట పర్వతాలు, ఆస్మత్‌పూర్

లిస్టులో పేరు లేదు



నేను గతంలో రూ.60వేలు పంట రుణం తీసుకున్నాను. రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు. మంచాల రైతు వేదిక వద్దకు వెళ్లి అధికారులకు బ్యాంకు కాగితాలు చూపించాను. నా పేరుపై ఎలాంటి వివరాలు చూపించడం లేదని పేర్కొంటున్నారు. సాంకేతిక లోపంతో రుణ మాఫీ కాలేదంటున్నారు. తిరిగి మరల దరఖాస్తు పెట్టుకున్నా.

– కాళ్ల జంగయ్య, ఆస్మత్‌పూర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం



అర్హత ఉండి పంట రుణ మాఫీలో పేర్లు రాని రైతులనుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేర విచారణ చేసి అందరికీ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

– జ్యోతిశ్రీ, మండల వ్యవసాయాధికారి, మంచాల

ఉద్యోగికి విరమణ సహజం

ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డి, చంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది

మహేశ్వరం: ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్, మెకానికల్ సూపరిండెంట్ పి.చంద్రయ్య పదవీ విరమణ సందర్భంగా ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది ఘనంగా వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది వృత్తిపరంగా అన్నివిధాలుగా సహకరించారన్నారు. రాష్ట్రంలోని మహేశ్వరం డిపోను లాభాల్లో మొదటి స్థానంలో నిలబెట్టడంతో పాటు గోల్డ్‌మెడల్ అవార్డు అందరి సహకారంతో రావడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. మహేశ్వరం డిపోను అన్ని రంగాల్లో ముందుండి నడిపి అదాయం తీసుకొచ్చి ప్రభుత్వానికి లాభాలు తీసుకొచ్చామన్నారు. పదవీ విరమణ పొందుతున్నందుకు బాధగా ఉందన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది పూలు, శాలువాలు, జ్ఞాపికలతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



సభ వద్ద ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతున్న కేఎల్‌ఆర్, తీగల తదితరులు

మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, తీగల కృష్ణారెడ్డి

కందుకూరు: నెట్ జీరో సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమం, అనంతరం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ ఆర్, తీగల కృష్ణారెడ్డి కోరారు. బుధవారం సీఎం హాజరయ్యే కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని సీఎం రెండో హైదరాబాద్ నగరంగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాను రద్దు చేశారన్నారు. ఇక్కడే ఇంటర్‌నేషనల్ స్థాయిలో పాఠశాలను ఏర్పాటు చేసి, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణ సైతం ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బడంగ్‌పేట చైర్‌పర్సన్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, కృష్ణనాయక్, కృష్ణరాం భూపాల్‌రెడ్డి, చిర్ర సాయిలు, ఎస్.వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

సబితారెడ్డిపై వ్యాఖ్యలు బాధాకరం



తుక్కుగూడలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మీర్‌పేట చౌరస్తాలో..

తుక్కుగూడ: రాష్ట్ర అసెంబ్లీలో మాజీ మహిళా మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క చేసిన వ్యాఖ్యలు బాధాకరమని తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓ మహిళ ఎమ్మెల్యే అని చూడకుండా కాంగ్రెస్ నాయకులు టార్గెట్ చేసి నిండు సభలో ఆమెపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పని చేసే నాయకురాల సబితాఇంద్రారెడ్డి అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బాకారం వెంకటరాజీరెడ్డి, బంటు రమేశ్, శ్యామేల్ రాజు, మల్లేశ్, హరికృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంల దిష్టిబొమ్మలు దహనం

తుక్కుగూడ: రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై రాష్ట్ర శాసన సభలో అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల బీఆర్‌ఎస్ నాయకులు తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు జల్లాల లక్ష్మయ్యయాదవ్, వెంకట్‌రాజీరెడ్డి, శ్రీలత, శ్రీనివాస్, రమేశ్, శ్యామేల్ రాజు, శ్రీధర్‌గౌడ్, సురేశ్, బుచ్చిరెడ్డి, హరికృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డిని అవమానించడం సరికాదు

బడంగ్‌పేట్: నిండు శాసనసభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని టార్గెట్ చేసి అవమానించడం కాంగ్రెస్ పార్టీకి మంచిది కాదని బడంగ్‌పేట కార్పొరేటర్ లిక్కి మమతకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు భవిష్యత్‌లో పుట్టగతులుండవని మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి సబితారెడ్డితోనే జరిగిందని, ఆమెకు మేము అండగా ఉంటామన్నారు. అడుగడుగునా కాంగ్రెస్ పార్టీ నాయకులకు అడ్డుకుంటామన్నారు. సబితారెడ్డిని అవమానిస్తే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు.

సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలి

మీర్‌పేట: అసెంబ్లీలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మీర్‌పేట్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సబితారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయనతో పాటు భట్టి విక్రమార్కల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దిండు భూపేశ్‌గౌడ్, పొరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వీరురెడ్డి, విజయలక్ష్మి, సురభి లత, భరత్, నర్సిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, అనిల్‌యాదవ్, భీరప్ప, మాధవి, నాగరాజు, యాదగిరి, గోపియాదవ్, బషీర్, జంగయ్య, మహేందర్, వెంకటేశ్, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.

సీనియర్ మంత్రి అని చూడరా?

బడంగ్‌పేట్: శాసన సభలోనే సీనియర్ మంత్రి, ఎమ్మెల్యే అని చూడకుండా సబితారెడ్డిపై నిండు సభలో వ్యాఖ్యలు చేయడం సరికాదని బడంగ్‌పేట కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఆశయాలతో లక్ష్యాలతో పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నేడు ప్రజలను మరిచిపోయి వ్యక్తులను టార్గెట్ చేస్తుండటం సిగ్గుచేటని ఘాటుగా విమర్శించారు. యావత్ తెలంగాణతో పాటు మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు సబితారెడ్డికి అండగా ఉంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని సొంత తమ్ముడిలా భావించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని రేవంత్‌రెడ్డి అవమానించడం బాధాకరమన్నారు. సబితమ్మకు అండగా ఉంటాం, కాంగ్రెస్ పార్టీని అడుగడుగునా అడ్డుకుంటామని ఆమె హెచ్చరించారు.

మదర్ డెయిరీ మేనేజర్‌కు సన్మానం



కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

యాచారం: మాల్ కేంద్రంలోని మదర్‌డెయిరీకి 12ఏళ్లు మేనేజర్‌గా సేవలందించి బదిలీపై వెళ్తున్న కరుణాకర్‌రెడ్డిని బుధవారం రైతులు ఘనంగా సన్మానించారు. మాల్ కేంద్రంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సభకు మదర్ డెయిరీ ఎండీ బి కృష్ణ, అకౌంటెంట్ సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి మదర్ డెయిరీ సొసైటీల చైర్మన్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కరుణాకర్‌రెడ్డి 12 ఏళ్లు మాల్ మదర్‌డెయిరీకి సేవలందించి, రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. అనంతరం కొత్త మేనేజర్‌గా వెంకటయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు బందె మహేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జంగయ్య, రామ్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మహేశ్వరం: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లీడ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల, గురుకులాల్లో నాణ్యతతో కూడిన విద్య అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి ఇష్టంతో చదువుకోవాలన్నారు. లీడ్ ఇండియా, కేఎల్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో లీడ్ ఇండియా, కేఎల్‌ఆర్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపల్ ప్రేమలత పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

అభివృద్ధి, సంక్షేమంలో నిర్లక్ష్యం వద్దు

యాచారం: అభివృద్ధి, సంక్షేమంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామాల ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో వేగవంతంగా పనులు చేయాలని సూచించారు. అదే విధంగా తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసి, ట్యాంకులకు పైకప్పులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీటి పైపులు లీకేజీలు కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలకు విష జ్వరాలు, డెంగీ వ్యాధులు సోకకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు.